3

తొలుదొల్త దుఃఖాలు దూరమ్ము చేసి
నిండు మానసమును నిర్మల పఱచి
ఆనందబీజాల నంతట నాటి
అంతయుఁ దనలోన నైక్యమొందంగఁ
జేయుచు వ్యాపించు చిన్మయు వేణు
నాదం బొసంగును నాకు సంపదలు !

౪

వనలక్ష్మి సౌందర్య వైభవం బెచ్చ
జనము చేష్టలు దక్కి సంతోష మొంద
ప్రకృతిగాయకులెల్లఁ బ్రమదంబు చెంది
తల లూచి భళియంచు దండంబు వెట్ట
మూఁడు లోకాలును మోహించు వేణు
నాదం బొసంగును నాకు సంపదలు !

౫

భక్తుల హృదయాల భాసిల్లు నట్టి
ముని మనస్సులు మారు మ్రోసెడు నట్టి
కష్టాలు గంగలోఁ గలుప గలట్టి
సుఖ మార్గ మంతలోఁ జూపగలట్టి
దివ్యమౌ మోహన దేవుని వేణు
నాదం బొసంగును నాకు సంపదలు !

# రైలుబండిలో ప్రేమ

[చింతా దీక్షితులు]

ఆయనగారికి ముప్పైరెండో యేట భార్య పోయింది. పోయినతరవాత ఆయన మళ్లీ పెళ్లిమాట తలపెట్టలేదు. ఆయన తలపెట్టకపోవడముమాటఅలా వుండగా ఆయనకు దగ్గరబంధువులూ ఆప్తులూ అనేవారుకూడా ఆప్రశంస అసలే ఎత్తలేదు. "బాగుండదు. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని ఆయనపినతండ్రిమాత్రము ఏదోయెక్కడైనా చూసి మళ్లీ ముడేస్తేనేకాని వాడినోట్లోకి మెతుకులు వచ్చేమార్గం లేదు. ఆరవంతపనీ నీవూనేనూ కలిసి చేస్తిమట్టాయనా తరవాత వాడిబతుకు వాడుబతుకుతా" డని అన్నాడు ఆయన పినమామగారితో.

"ఇద్దరుపిల్లలూ, బెడదా ఉంతుండగా ఇంకాపెళ్లిమాట లేమిటి బావా!" అన్నాడు పినమామగారుపరిహాస్యముగా. దానితో ఆయనద్వితీయము సంగతి ఆగిపోయింది.

పెళ్లాముతో కాపరముచేసేటప్పుడైనా ఆయన ఒకరోజు భార్యతో కలిసిమెలిసి లేడు. ఎప్పుడూ పెళ్లాన్ని కొట్టడమో, తిట్టడమో! ఇంతేకాని చిలకాగోరువంకలాగా వుండేవాళ్లు కారు. ఏమో అన్యోన్యము లేదని చెప్తే వాళ్ళ కిద్దరుపిల్లలు ఏలాకలిగినారు? అదోగాలిపాటు!

భార్యపోయి మూడేళ్లయింది ఆయనపెద్దపిల్లవాడికి పన్నెండుసంవత్స

రముల యీడు వచ్చింది రెండవపిల్లవాడికి తొమ్మిదోసంవత్సరము. ఈకాలపుపిల్లకాయలకు చిన్నతనంలోనే స్వతంత్రం అబ్బుతుంది కాబట్టే పెద్దపిల్లవాడు అప్పుడే తలకు క్రాపింగు చేయించుకున్నాడు. పంట్లాము తొడుగుకుంటున్నాడు, చిరిగిపోతే పోయింది కోటుకూడా వేస్తున్నాడు; అంతేకాకుండా వాళ్ళమ్మతాలూకు ఎర్రరవికలను చింపి సన్ననిపేలికలను మెడచుట్టూ చుట్టుకుంటున్నాడు. దొరలు అలాచుట్టుకుంటారు, అది నాగరికలక్షణం అనేసంగతి తెలియకుండా బడిలోపిల్లవాళ్లు వీడిని చూసి ఆక్షేపించేవారు!

రెండోపిల్లవాడు పాపం ఇంకా చిన్నతనం అవడంచేత ఈవేషభాషలు నేర్చుకోలేదు. మాసినగావంచాగుడ్డ కట్టుకొని వీధులవెంట తిరుగుతూవుంటాడు. అప్పుడప్పుడు బడికిపోవడంకూడా కద్దు చదువుకోవడం లేదని తండ్రిచేత తన్నులు తినడంకూడా కద్దు. బొడ్డూడనికుర్రకుంకను కిరసనాలుబుడ్డి ముందర కూలవేసి, "చదువు, వెధవా చదువు; బియ్యేప్యాసవు," అంటేవాడు చస్తాడా!

పాపము వీడికి క్రాపింగు లేదు కాని: పూర్వకాలపుబ్రాహ్మణచిన్నవాళ్ళ కున్నట్లు జుట్టుమాత్రం కలదు. పూజాపురస్కారాలు లేకపోవడంచేత అది ఒకళ్ళకు లొంగక ఇష్టంవచ్చినట్టు స్వేచ్ఛగా శిరస్సుమీద విహరిస్తూవుంటుంది.

ఎలాగో యీపిల్లవాళ్ళ నిద్దరినీ పెట్టుకొని ఆపెద్దమనిషి కాలక్షేపం చేస్తూవున్నాడు. రానురాను అతనికి కొంచెం పెండ్లిమీద భ్రమకలిగింది. కాని పెళ్లిజరిగేవిధం లేదు. అతనికి భూము లున్నాయా చదువు లున్నాయా ఎవరైనా పిల్ల నివ్వడానికైనా!

ఒకనాడు అతడు రైలుబండీమీద ప్రయాణం అయివెళ్లుతున్నాడు అది బూర్సుబండీ అవడంవల్ల అతడు కూర్చున్నగదిలో చాలామంది జనం లేరు.

నెత్తికి పొత్తుపంచ తలపాగా చుట్టుకొని మాసిపోయిన కుడితినీలోనుంచి తొంగిచూస్తున్న జంధ్యాలవల్ల బ్రాహ్మణుడని తెలిసికోగల పెద్దమనిషి వక్కడు.

మెడలో బంగారపురుద్రాక్షపూస కట్టుకొని గూడకట్టుతో నున్ననితలతో కమలాఫలము వొలిచి సేవకుడు ఇస్తూంటే తినే నాటకోటిసెట్టి యింకొకడు.

బాహ్యవేషాన్ని బట్టి చూస్తే తెల్లదొరవలె వుండవలెనని ప్రయత్నాలు సలిపినప్పటికీ తనశరీరకాంతి హిందూత్వమును వెల్లడిచేస్తూన్న దనే సంగతి గుర్తెరగక, ఎడమచేతితో మీసము దువ్వుకుంటూ పాపిడి సవరించుకుంటూ కుడిచేతితో ఇంగ్లీషునవలను పట్టుకుని బహుదీక్షతో చదువుతూన్నట్టు నటించు నవనాగరికవిద్యార్థి యింకొక్కడు.

సన్నగ్లాసుగోమల్లు అద్దకపుచీరధరించి, మోచేతులుదాటివచ్చు జాకెట్టు

తొడిగి, రెండుభుజాలవద్దా రెండుపొళ్ల పిన్నులను గుచ్చి (ఈపొళ్లు గాజురాళ్ళే అనికొందరు స్త్రీలు స్టేషనులో అనుకున్నారు) బంగారపు సన్ననిగాజుల జత ముంజేతుల కలంకారమగునట్టుచేసి, నిష్కలంకవదన బింబముతో (అక్కడక్కడ నల్లనిమచ్చ లున్నాయి కాని, ప్రబంధకారులు కళంకంగా భావించిన బొట్టు లేదు కాబట్టి నిష్కలంకం అనవచ్చు) చెన్నారుతూ, నవనాగరిక విద్యార్థి తడవతడవకూ బంపు క్రేగంటి చూపులు తనపై బడినవని యెరిగియూ, పడనట్టు భ్రమింపజేయుచూ, కిరస్తానీ సోదరీమణులను తలపునకుదెచ్చు నాగరిక ప్రౌఢ వితంతు వొకతె.

ఇంకా నలుగురైదుగురు బండిలో కూర్చున్నారు. ఈమె కూర్చున్న బెంచీ మీద కూర్చున్నాడు మనకథానాయకుడు. ఇంటివద్ద ఎలాగంటిదుస్తులు ధరించినా ప్రయాణాలలో మాత్రం ఇతను మంచిబట్టలు వేసుకోవడం కద్దు; ఆబట్టలు అత్తరువువాసనకూడా కొడుతూ వుంటవి. నేడతను కాకీషర్టు వేసుకున్నాడు. షర్టుచేతులను మోచేతివరకూ ముడిచివేసినాడు; కుడిచేతికి తగిలించుకున్న బంగారపుగొలుసు అందరికీ అగుపించాలని అలావేసినాడని స్టేషనులో కొంత మంది పెంకెసజ్జుకుర్రవాళ్లు అనుకున్న మాట వాస్తవం, భుజంమీద కండువా గాని నెత్తిమీద టోపీగాని ఉన్నవేమో అని చూడనక్కర లేదు; ఎందుచేతనంటే నెత్తిమీద టోపీ పెట్టుకుంటే నున్నగా దువ్వుకున్న పాపిడి చెరిగిపోతుంది; భుజంమీద కండువా వేసుకోవడం నవీనాచారకాండలో లేదు. అతడు నల్లగా వుంటాడని లోకులు వాకొంటారు కాని అతని అభిప్రాయం మాత్రం అదికాదు. విజయవిలాసంలోసుభద్ర చెప్పిన, "ఎగుభుజంబులవాడు మృగరాజ మధ్యంబు బుడుమిపుచ్చుకొను నెన్నడుమువాడు,

..........................................

...మెరుగుచామనచాయమేనివాడు ...

ఇత్యాదిపద్యం అతనికి కంఠతా రావడం మాట అటుండగా ముస్తాబైనప్పుడల్లా ఆపద్యమే చదవడంకూడా అలవాటు. చంద్రుడికి కళంకం వున్నట్టు అతడికి ఒక గొప్పలోటుమాత్రం వున్నది; అది నిజంగా లోటుగా ఎన్నవలసింది కాదు. ఏమంటారా? కళ్ళురెండూ వాటివ్యాపారం అవిచేస్తూవుండడమే మనకు కావలసిన విషయంకాని వాటికి కొంచెం మెల్లవుంటే నేమి? ఈయనకు ఈమెల్ల యేమైనా సౌందర్యలోపం కలుగజేసిందా? ఒకవేళ అది అంగవైకల్యమే అనండి, లోపమే కాగట్టండి. అయినా లోకంలో ఎందరికి లేదు ఈలోపము? ఈసంగతి ఆయన ఎన్నిమార్లు అనుకోలేదు?

మన కథానాయకుడు బెంచీమీద కూర్చుని (మెల్లకన్ను అవడం మూలాన కాబోలు) ఒకకంటితో ఈవైపు, ఒక కంటితో ఆవైపు వక్కమారు బండిలో వున్నవాళ్ళను పరీక్షించేడు. ఆపరీక్షకు ఫలితం ఏమంటే, ఆయన కుడికన్నునుంచి వచ్చేదృష్టులు ప్రౌఢవితంతువు మీద వాలినవి. ఎడమకన్నులోనుంచి బయలు

చేరిన చంచంద్రుజ్యోలికలు నాటికోటి సెట్టి చేతితో పట్టుకున్న కమలాఫలపు తొనమీద పడ్డాయని సెట్టిఅనుకున్నాడు. విశ్వస్త చూపులు ప్రస్తుతం రైలు బండికిటికీలోనుంచి దాటి వెలపలనున్న కొండలమీద ప్రయాణం చేస్తున్నట్లున్నాయి. కాని ఆడవాళ్ళ కళ్ళు హరిణశాబక నేత్రాలవలె లోలములై వుంటాయని చెప్పడంవల్ల ఏక్షణంలో ఎక్కడికి చూపులు ప్రసరింపచేస్తున్నాయో చెప్పడం దుర్లభం! ప్రబంధకారు డెవడైనా అప్పుడక్కడ వున్నట్లయితే తక్షణం మన్మథుడు ఎడమా కుడీ విచక్షణ లేకుండా పుంఖానుపుంఖంగా పూలబాణాలు ఇద్దరిమీదా విసురుతున్నాడని వర్ణించకపోడు ఇద్దరిమీదా విసురుతున్నా లేకున్నా మన కథానాయకుడి మీదమాత్రం ఆ బాణాలు పడి బాధపెట్టినవనిమాత్రం స్పష్టం. ఎందుచేతనంటే హూహూరుమని నడుస్తున్న రైలుబండిచప్పుడులో లీనమై కొంచెం కొంచెంగా మూలుగులు వినబడ్డాయి. ఈమూలుగులు క్రమక్రమంగా రాగవరసలోకి మారినాయి. రాగమూ ఆలాపన చేస్తున్న మనకథానాయకుని కుడికన్ను కుడిరెప్పలోకీ ఎడమకన్ను ఎడమరెప్పలోకీ పోయి తెల్లగుడ్లుమాత్రం పయికి కానవచ్చేయి. ఆ తెల్లగుడ్లు ఎవరినైనా చూస్తున్నాయా ఏమో అంటే, అది చెప్పవీలుపడదు.

రాగాలాపనచివర నాలిక పళ్లసందున పడి బండిలోవున్న వారిని తొంగిచూసింది; తనప్రవీణత అందరూ మెచ్చుకుంటున్నారో లేదో అని తెలుసుకోవడమునకు కాబోలు. ఇంతట్లో నాలుక లోపలికి పోయింది, నల్లగుడ్లు బయటికి వచ్చేయి, కుడికన్ను విశ్వస్త మీద పడ్డది ఎడమకన్ను సెట్టిమీద పడ్డది. విశ్వస్త కొంగులో దాచుకున్న తామలపాకుల్సా, చెక్కలూ సున్నపుకాయూ పయికి తీస్తూవున్నది. సెట్టి బట్ట సవరించుకొని చేతులు కడుగుకుంటున్నాడు.

రాగం విసరడం అయినతర్వాత కథానాయకుడు కంఠం సర్దుకుని పద్యం చదవడం ప్రారంభించేడు. రాగాలాపన బండిలో వున్న వాళ్లందరికీ సంతోషమిచ్చిందనేఆతనిధయిర్యమే పద్యం చదివించిందంటే ఎక్కువసరసంగా వుంటుంది.

ఉవిద, నీకపరాధ మొనరించితినయేని వెలనూలుతో నన్ను మోదరాదె?

అనేపద్యాన్ని మొదలుపెట్టి రాగవరసతో చదవడం ఆరంభించేడు. భావశూన్యం కాబట్టి రాగమునకు అభినయము అనవసరము. భావప్రధానము గల పద్యానికి అభినయము ప్రాణమనేసంగతి మనకథానాయకుడికి తెలుసును. అందుచేతనే రైలుబండి చప్పుడులో శ్రుతికలిపి అభినయపూర్వకంగా పద్యం చదవడం ప్రారంభించేడు. కాని యీఅభినయకార్యమును ముఖ్యముగా చేతులే చెయ్యడం మొదలుపెట్టేయి. నాటకాలలో తిరిగే నేటినటుడు ఈఅభినయాము ముందు ముఖమున భావమువ్యక్తమగుతుంటే లేదని తప్పుపడుతాడు. కాని

ముఖమునకల్లా ప్రధానమైనది కన్ను కంటిలోని నల్లగుడ్డు పైరెప్పలోకి పోగా మిగిలిన తెల్లగుడ్డు కొంతమట్టుకు భావాన్ని వెల్లడి చేస్తున్నాయని చెప్పవచ్చును.

ఈఅభినయంలో కుడికన్ను చూపినదారివైపు కుడిచెయ్యి విశృంఖలంగా పోయినది! ఎడమకన్ను చూపినమార్గాన్ని ఎడమచెయ్యి పోవడంమూలాన పెట్టి మనస్సులో భయబీజము లంకురించడమే కాకుండా, నిలుచున్నపాటున ఒళ్ళు ఒలిచేద్దామనే న్యాయమైన సంకల్పంకూడా కలిగింది కానిఅది ఆచరణలోకి రాలేదు.

కుడిచెయ్యి విచ్చలవిడిగా కుడివైపు సంచరించడం నవనాగరికవిద్యార్థికి సత్యాగ్రహము కలగడమునకు ప్రథమ కారణము. సత్యాగ్రహమునకు ఫలము —అతనిముఖం ఎర్రబారడం చొక్కాచేతులు వెనకకు వెళ్లడం, నవల చేతిలోనుంచి కిందపడడం, గొలుసుపట్టుకు లాగి రైలుబండి ఆపుదామనే దృఢసంకల్పము. ఈసత్యాగ్రహం ఏవిధంగానూ కార్యరూపంగా పరిణమించలేదు.

ఈఅభినయముతో పద్యం పూర్తిఅయిందని బండిలోవాళ్ళందరూ సంతోషించారు. విశ్వస్తముఖమున మందహాసరోచు లంకురించినవనీ ఎర్రని పెదవులుదాటి పైకివచ్చిన దంతములధావళ్యమట్లు చాటుతున్నదనీ మనకథానాయకుడు ఊహించినాడు. కార్యమునుబట్టి కారణము నూహించడము బుద్ధిమంతుల లక్షణం. ఆమె మనస్సులో ప్రణయబీజము లంకురించినవనుట కనుమానమీవూహే ఆతని కొసంగినది. కారణం వినా కార్యం జరుగబోదు కదా! కాని నిజముగా ఆలోచిస్తే ఈవూహకు ఆధారము లేదు. ఎందుచేతనంటే ఆవిశ్వస్తదంతములు సహజముగా పెదవులను దాటివుండి నిరంతరము తెల్లవెన్నెలలు కాయుచునేయుండును. ఇట్లుండుటవల్లనే కాబోలు తనముఖము నవ్వుముఖమని ఆమె అనుకొనుచుండడము కూడా కద్దు.

ప్రణయబీజాలంకురించేయని నమ్మి మనఆయన మళ్ళీపద్యం మొదలుపెట్టి చాలాజాలిపుట్టేటట్టు చదవవలెనని పూనుకున్నాడు:

**అతివా, దాపగనేల ? నిన్వలచి నీకత్యంత సంతాపదుస్థితి జేకూరిచి**

ఇత్యాదిపద్యం అభినయపూర్వకంగా రాగవరసతో చదివినాడు. ఇందులో మొదటిపాదం రెట్టించి చదివేడు కాని, శృంగార, కరుణా, భీభత్సరసములందుమిళితములై యున్నాయని లాక్షణికు లభిప్రాయపడకపోరు. అయితే శృంగారము పద్యమునందునూ, కరుణారసము చేతులను జోడించి విశ్వస్తవైపు తిప్పి అంజలిఘటించడములోనూ, భీభత్స మాతని ముఖలక్షణములందూ వేర్వేరుగా తాండవమాడుచుండడము చేత రససాంకర్యము కలిగినదనికాని దోషము పట్టినదనికాని వూహించ నవసరంలేదని సమాధానం చెప్పుకోవచ్చును.

ఇంకా పద్యం పూర్తికాకముందే రైలుబండి రాజమహేంద్రవరం స్టేషనుకు వచ్చినిలబడ్డది, పద్యముకూడా ఆగిపోయింది. శృతిలేక ఆగిపోయిందేమో అనిసందేహ పడనక్కరలేదు, ఆగిపోవడం సాభిప్రాయపూర్వకంగానే జరిగింది. మనకథానాయకుడి నల్లగుడ్లు పయిరెప్పలలోనుంచి యువతలకు వచ్చినవి. కుడికన్ను యథాప్రకారం విశ్వస్తమీద పడుటకుబదులుగా ఆవిడకూర్చున్న బెంచీభాగంమీద పడ్డది; ఎడమకన్ను పెట్టెబోడితలకాయను పరీక్షిస్తూన్నట్లున్నది. మన కథానాయకుడు ఏకారణంచేతనో ముఖం బిక్కవేసి రైలుబండి గుమ్మమువైపు చూసినాడు. విశ్వస్త కిందకుదిగి తనతాలూకుపెట్టెను కిందకుదింపుకుంటున్నది. మనకథానాయకుడు లేచినాడు; జేబులోనుంచి టిక్కెట్టుతీసి పరీక్షించినాడు. దానిమీద ఏలూరని వ్రాసివున్నది. ఏలూరనిరాసి వుంటేమాత్రం రాజమంద్రిలో దిగకూడదా లనుకున్నాడు. అనుకుని అమాంతంగా ఆమెపెట్టెమీదనుంచికిందికి మమికి పెట్టెను రెండుచేతులతో దింపినాడు. దింపి తనపౌరుషమును లోకమునకు చాటినాడు. చాటినసంగతి ఆమె గ్రహించినదా లేదా అని తెలిసికొనుటకై కాబోలు ఆమెవైపు చూసినాడు. లేదులేదు; ఆమెవైపు ముఖం తిప్పినాడే కాని కళ్ళుమాత్రం ఆవిడమీద పడలేదు. అవి యెవరినో చూస్తున్నట్లున్నాయికాని ఆమెను చూస్తున్నట్లు లేవు తరవాత ఆయన, "పెట్టె చాలాబలువుగా వుందండీ!" అని తనకుగల వస్తుగుణవిజ్ఞానమును వెల్లడిచేసినాడు. "అవును, బలువుగానే వుంది" అని ఆపూర్వసువాసిని ఆతని వాక్యమును బలపరిచింది.

ఇంతట్లో కూలివాడు మూటలున్నాయా అని రాగా విశ్వస్త మూట్లాడకముందే మనకథానాయకుడు వాడి చేతులో బేడకాసుపెట్టి, పెట్టె అవతల పెట్టించినాడు

"బండి ఎక్కడికి కట్టించవలసివుంటుందో? అని తనసందేహము వ్యక్తపరచినాడు మనకథానాయకుడు.

"సెబాసు, ఎంతమాట! మీరెవరో మీకు శ్రమయివ్వడం

అనబోతూండగా ఆయన, ఇన్నీసుపేట కట్టించనా? అనిప్రశ్నించినాడు.

"ఆర్యాపురం వెళ్ళవలసివుంది కాని-మీ రెక్కడికి వెడతారు? అని ఆమె అన్నది.

అయితే నాళంవారిసత్రానికి బండి కుదురుస్తాను అని ఆయన బండి కుదిర్చినాడు

బండి ముందు నడుస్తున్నది బండివాడు నడుస్తూ బండి తోలుతున్నాడు. ఆయన వెనకాల బయలుదేరేడు.

"నాకోసం మీరు చాలా శ్రమపడ్డారు" అని విశ్వస్త అన్నది.

"ఎంతమాట! మీరలా అనకూడదు. మీబోటివాళ్ళకోసం శ్రమపడకపోతే నే నెందుకు బతకడం?" అని తనజీవితాశయము వెల్లడిచేసినాడు.

"మీది రాజమంద్రి మేనా? మీ

పేరేవరండీ? అనివిశ్వస్త ఆతనిజీవితచరిత్రపై తనకుగల అభిమానమును తేటతెల్లము చేసింది

“మాది కాకినాడ అయితే నేమి నాకు ఒకఊరంటూ లేదు నాపేరు అప్పయ్—కాదు ఏమిటీ అన్నారూ

-నాపేరు అప్పారా వంటారు. అయితే మీది ఆర్యాపురం కాపరస్థలం కాదనుకుంటాను.

అసలు మాది గుంటూరు. ఏం చెప్పను నారాత యిలా రాసివున్నది. అనుభవించక తప్పుతుందా అని కంటతడిపెట్టినది ఆమె

ఊరుకోండి ఏం చేస్తాము నే నెవరితో చెప్పుకోను? అని అప్పారావు కంటతడిపెట్టేడు.

నా కింతరాత రాసుండగా ఒకళ్ళని అనవలసినపని యేమిటి? కుదురు కేకుండా- అని దీనస్వరంతో విలపించబోయింది.

ఏం చెప్పను? తలుచుకుంటే దుఃఖంచేటు! నమ్ముతారో లేదోకాని సరిగ్గా మీపోలికే సుమండి అని అప్పారావు విలపించినాడు.

విశ్వస్తపెదవులలోనుంచి కొంచెంగా చిరునవ్వు వచ్చి నిజంగా? అని అన్నట్లుంది.

నిజంగా మీరు నమ్మండి మానండి అచ్చంగా మీరూపమే! అని మళ్ళీ కంటతడిపెట్టి అదే బతికివుంటే యిన్నిపాట్లు నాకెందుకు సంభవిస్తాయి అని నిట్టూర్పు విడిచినాడు.

విశ్వస్త విననట్లు నటిస్తూ ఆయన బతికివుంటే అడ్డమయినవాళ్ళూ ఇలా నన్నెందుకు లోకువ చేస్తారు.అని తన వర్తమాన స్థితిని గురించి విచారించింది.

ఆమాటలు వినడంతోనే అప్పారావుగుండెలో రాయిపడింది కొంప మునిగిం దనుకున్నాడు మంచిచెడ్డలు తెలియకుండా ప్రవర్తించినందుకు తగినశాస్తి జరిగిం దనుకున్నాడు;

ఇం కెప్పుడూ ఇలాంటిపని చెయ్యవని మనస్సులో ఒట్టు పెట్టుకున్నాడు; తన్ను తాను నిందించుకున్నాడు; గట్టిగా నాలిక కొరుక్కున్నాడు. ఆడవాళ్ళను నమ్మరాదురా బతికివుండగానూ అనుకున్నాడు.

“తరుణివిభ్రమంబు తలపోయ శక్యమే ధాతకైన వానితాతకైన” అనే పద్యం జ్ఞాపకం వచ్చింది. ఏలూరుప్రయాణం చెడి యింతమట్టుకు వచ్చింది కదా అనుకున్నాడు. రాజమంద్రిలో నెతుకులు వచ్చేవిధం ఎలాగ, మళ్ళీ ఏలూరికి ఎప్పుడు బండీ వెళ్లుతుంది, అది తెలుసుకోడం ఎలాగ అని ఆలోచిస్తున్నాడు. ఇంకా అక్కడ నిలబడితే ఏమి చివాట్లు తాపలుతయో, యేమి చిక్కులు సంభవిస్తాయో అని వెనకబట్టడానికి ప్రయత్నాలు చేస్తుండగా ఆమె, “చూశారా యీవుత్తరం నమ్మించి ఎలాగ గొంతుక కోసేడో అన్నది. అప్పారావుకు కొంతమట్టుకు ధైర్యం చిక్కింది ఉత్తరం పుచ్చుకొని యిలా చదువుతున్నాడు.

బెజవాడ,

శ్రీమతి నరసాంబకు - సుబ్బారాయుడు రాసే నివేదన: మన వివాహం విషయంలో గుంటూరు నీవు రావలసిందనిన్నీ, అక్కడ యావత్తు సంగతులూ పరిష్కరించుకొని వివాహం చేసుకుందామనీ చెప్పియున్నాను. కాని మా తల్లిదండ్రులకు ఈవ్యవహారం తెలియడం వల్లనూ, స్నేహితులు వెళ్లవద్దని బలవంతం చెయ్యడంవల్లనూ నేను గుంటూరు రాలేక పోయినాను. ఇందువల్ల నీకు తెలియచెయ్యడం ఏమంటే! నేను నిజంగా నిన్ను ప్రేమించివున్నా ప్రస్తుతంలో నిన్ను పెళ్లిచేసుకోడానికి వీలులేదు. నీవు తక్షణం రాజమండ్రికి వెళ్లిపోవలెను. వెనుకనుంచి వీలును బట్టి ఉత్తరం రాస్తాను. ఖర్చునిమిత్తం ఈ ఉత్తరంతో అయిదు రూపాయిల నోటు పంపినాను. ఈవిధంగా రాయవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను.

గ్రహించవలెను,

సుబ్బారాయుడు వ్రాలు

"ఎంత ద్రోహం చేసేడూ! ఇతగాడు చాలా దుర్మార్గుడు లా వున్నాడే!" అని తనకోపాన్నీ, సుబ్బారాయుడి యెడల తనకుగల అభిప్రాయాన్నీ ఒక్కమారు తెలియజేసేడు.

"ఇంక నన్ను చూసేవా రెవరు? ఏకాకినై యిలా తిరగ వలసిందే. నాబతుకు ఇలా అయిపోయింది!" అని నర్సాంబ మళ్లీ కంటతడిపెట్టింది.

"విచారించకండి. మీరు విచారిస్తే నేను విచారించి నట్లుంటుంది. మీరు ఏకాకిగా వుండవలసిన కర్మ మేమిటి నేను బతికివుండగాను—? మీకు అభ్యంతరం లేకపోతే సరీ—"

నర్సాంబ మాట్లాడలేదు.

"మీరు సందేహించ వలసినపని లేదు. నేనూ కొంతమట్టుకు ఇంగ్లీషు చదువుకొన్నాను. ఇంగ్లీషు మాట్లాడగలను కూడాను. తెలుగులో కవిత్వం చెప్పతాను. వుద్యోగంలో వున్నాను. వర్తకం చేద్దామనికూడా వుంది—"

నర్సాంబ కొంచెం నవ్వింది.

ఇంతట్లోకే బండి నాళంవారి సత్రం దగ్గిరికి వచ్చి ఆగిపోయింది. సత్రంలో వారిద్దరూ ఒకగది పుచ్చుకున్నారు. ఆరోజునే వారిద్దరికీ పెళ్ళిసంబంధం స్థిరపడింది. రెండురోజులు పోయినతరువాత పెళ్ళిముహూర్తం పెట్టుకోవచ్చునని అనుకున్నారు.

ఆరాత్రి అప్పారావు కాకినాడ వెళ్ళినాడు పిల్లవాళ్ళను ఇద్దరినీ సత్తెలింగం సత్రములో అప్పజెప్పినాడు అక్కడ బడిలోనే వాళ్లను చదువుకు అప్పజెప్పినాడు. కుర్రవాళ్ళు ఏదో మూడందని చాలా ఏడ్చేరు. తండ్రితో వస్తామని మంకుపట్టు పట్టేరు. వాళ్లని ఊరుకోబెట్టడం బ్రహ్మాండం అయింది. మరునాడు అప్పారావు బయలుదేరి రాజమండ్రం వెళ్లేడు. నర్సాంబ యితనికోసం ఎదురుచూస్తున్నది. వారిద్దరికీ రాజమహేంద్రవరం తోటలో పెళ్లి జరగగలందులకు ముహూర్తం మధ్యాహ్నం మూడుగంటలకు ఏర్పాటుచేశారు.

పెళ్లికుమారుడు మధుపర్కములు ధరించినాడు, తెల్లని షర్టు తొడుగుకొన్నాడు, మక్కాబొట్టు పెట్టుకున్నాడు. పెళ్లికూతురు కొత్తచీర కట్టుకుంది జాకెట్టు తొడుగుకుంది. కాళ్లకు పసుపు రాచిందో లేదో చెప్పడానికి వీలులేదు. ఎందుచేతనంటే అక్కడకు వచ్చిన పెద్ద మనుష్యులలో ఈవిషయమై కొంతచర్చ జరిగింది. పసుపు రాసుకుందనికొందరూ— సుతరామూ రాసుకోలేదని మరికొందరూ. మొత్తంమీద దీని నిజానిజాలు పైకి తేలేయి కావు.

పెళ్లి చేయించడానికి ఒకపురోహితుడు వచ్చేడు; నాలుగురూపాయలికి ఒప్పుదల అయివచ్చినాడట. ఏలాగయితే నేమి పుస్తె ముడిపడింది. కరతాళధ్వనులతో హిప్పుహిప్పుహుర్రాలతో మహదాశీర్వచనము ముగిసింది. తరువాత అప్పగింతలు. ఒకపెద్దమనుష్యుడు వచ్చి పెళ్ళికూమార్తెను పెళ్ళికుమారుడికి వప్పజెప్పినాడు. యథాప్రకారం "అష్టవర్షాభవేత్కన్యా పుత్రవత్ పాలితా మయా......" ఇత్యాదిశ్లోకం చదివేడు. అష్టవర్షా అనేబదులు ఇరవైయేళ్ళ (వింశతివర్షా) అంటే బాగుంటుం దని కొందరు అనుకొన్నారు. అసలు ఆశ్లోకమే చదవడం తప్పని యింకాకొందరు అభిప్రాయపడ్డారు. ఎలాగైతే నేమి వొకపెళ్ళిజరిగినది; ఒకకుటుంబము— కాదు— రెండు కుటుంబాలు నిలబడ్డవి.

# పునర్దాంపత్యము

[కోపల్లె శివకామేశ్వరరావు]

కవి

పూవుల బుట్ట కెత్తితివి, మోమున ముత్తెములై శ్రమాంబువుల్
తీవరమయ్యె, ముంగురులు తేటకనుంగవ నావరించె, నిం
కోవిక సద్వయస్విని, మధూదయ వేళల యందుఁ దీవ్రబా
ధావినిపాతి సౌఖ్యమగు తత్కుసుమాపచయంబు లెందుకో !

కోసిన పూవు లున్న వతికోమలముల్, మధులిట్పదాహతిన్
మాసిన వైనఁ గావు, పవమానుఁడు లాలనచేసి పెంపఁగా
భాసిలి పిన్ననవ్వుల సువాసనలం గురియించుచుండె, ని
న్నోసుకుమార యౌవనశుభోదయ చంచల దృగ్వతీ, సతీ :